క్లుప్తంగా

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



విరాళం అందిస్తున్న వ్యాపారవేత్త యుగంధర్

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి ఒక్కరూ చేయూతనందిస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖకు చెందిన వ్యాపారవేత్త ఐవీఎస్ యుగంధర్ రూ.2 లక్షలు, నాగులాపల్లికి చెందిన బొడ్డేడ పద్మకృష్ణ రూ.50 వేలు, మునగపాకకు చెందిన ఆడారి సన్యాసిరావు రూ.10వేలు, పెంటకోట సుగుణ రూ.10 వేలు, విశాఖకు చెందిన గవర నాగేషు రూ.లక్ష, విశాఖకు చెందిన పెంటకోట నిర్మల రూ.2లక్షలు, అల్లిపురానికి చెందిన గ్రంధి రాజేష్ రూ.2లక్షలు, విశాఖకు చెందిన దాడి నారాయణరావు రూ.2లక్షల చొప్పున విరాళాలను ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట వెంకట్, పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



జి.సాయి అనీష్

పాయకరావుపేట: జేఈఈ మెయిన్స్–2025 ఫలితాలలో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్.భానుమూర్తి తెలిపారు. జి.సాయి అనీష్ 98.52 పర్సంటైల్, అంతేకాకుండా 90 ఆపైన పర్సంటైల్ సాధించిన విద్యార్థులు 20 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ అభినందించారు.

తిమ్మరాజుపేటలో అన్నసమారాధన



తిమ్మరాజుపేటలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో బుధవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఏటా మాఘపౌర్ణమి సందర్భంగా తిమ్మరాజుపేట మెయిన్‌రోడ్డులో అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. ఈ మార్గంలో పూడిమడక సముద్ర స్నానానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం స్థానిక వీరాంజనేయ సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులతో పాటు స్థానికులు కూడా తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

ప్రతి రైతు ఐడీ తీసుకోవాలి



చౌడువాడలో రైతు ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏవో సరోజిని

కోటవురట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రతి రైతు ఐడీ తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సరోజిని తెలిపారు. చౌడువాడ రైతు సేవా కేంద్రంలో రైతు ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ రైతు ఐడీ రిజిస్ట్రేషన్ కోసం వచ్చేటప్పుడు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానం చేసిన ఫోన్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక 11 అంకెల సంఖ్యతో ఐడీ నంబరు వస్తుందని, రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు ఈ ఐడీ తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ అందిస్తున్న శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు

అచ్యుతాపురం రూరల్: పూడిమడక తీరానికి మాఘ పౌర్ణమి స్నానాలకు వచ్చిన భక్తులకు శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు బుధవారం మజ్జిగ పంపిణీ చేసారు. భజన మండలి సభ్యుడు పాండురంగారావు ఆధ్వర్యంలో యలమంచిలి ఎస్ఐ బి.రామకృష్ణ ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.అప్పలనాయుడు, కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రం

- సముద్ర తీర ప్రాంతాలకు మాఘ పౌర్ణమి శోభ
- పుణ్య స్నానాలతో పులకరించిన భక్తులు







పూడిమడక తీరంలో సూర్య నమస్కారాలు చేస్తున్న భక్తులు

రేవు పోలవరం తీరంలో పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) జాతర పూజలందుకున్న శ్రీలక్ష్మీమాధవ స్వామి

నక్కపల్లి: పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లోని సముద్ర తీర ప్రాంతాలు భక్తులతో కళకళలాడాయి. మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాజయ్యపేట, చందనాడ, బోయపాడు ,బంగారయ్యపేట సముద్ర తీరాలకు భక్తులు పోటెత్తారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలి వచ్చి పుణ్య స్నానాలు ఆచరించారు. రాజయ్యపేట తీరానికి అధిక సంఖ్యలో భక్తులు పౌర్ణమి స్నానమాచరించేందుకు తరలి రావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు, రక్షణ ఏర్పాట్లు చేశారు. లోతు ఎక్కువగా ఉండి, కెరటాలు ఉధృతంగా వచ్చే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. బోట్లపై గజ ఈతగాళ్లు గస్తీ కాశారు. స్నానాలు చేసిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు, తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించి అక్కడి వరకు మాత్రమే వాహనాలను అనుమతించారు. స్థానిక యూత్ కమిటీ సభ్యులు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



పడిపోయిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న దృశ్యం



తీరంలో ఇసుక గూళ్లు కడుతూ సందడి చేసిన చిన్నారులు



పెంటకోట తీరంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న చిక్కాల యూత్ సభ్యులు



రాజయ్యపేట సముద్రతీరంలో స్నానమాచరిస్తున్న భక్తులు

పాయకరావుపేట: మండలంలోని తీర ప్రాంతంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పెంటకోట, పాల్మన్‌పేట, గజపతినగరం, వెంకటనగరం, రాజానగరం తీర ప్రాంతంలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పాయకరావుపేట, తుని, కోటనందురూ, తదితర మండలాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. మెరైన్ సీఐ వై.మురళీరావు, స్థానిక సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తీరంలో భక్తులకు మజ్జిగ పంపిణీ

మాఘ పౌర్ణమి సందర్భంగా పెంటకోట తీరంలో సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులకు చిక్కాల యూత్ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, చిక్కాల యూత్ సభ్యులు బొలిశెట్టి శ్రీను, చేపల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పూడిమడక తీరాన మొబైల్ టాయిలెట్

రేవుపొలవరం తీరంలో..

ఎస్.రాయవరం: రేవుపొలవరం తీరంలో మాఘ పౌర్ణమి జాతరకు విచ్చేసిన భక్తులకు శ్రీసత్యసాయి సేవా సమితి, ముసలమ్మ చారిటబుల్ సంస్థ సభ్యులు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు పాల్గొని భక్తులు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు శ్రీలక్ష్మీమాధస్వామి, దిగువన ఆలయంలో శ్రీషిరిడీ సాయినాథుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అడ్డురోడ్డు రేవుపోలవరం వరకు భక్తులు రాకపోకలు సాగించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడం, పోలీస్ సిబ్బంది ప్రధాన జంక్షన్లలో గస్తీ నిర్వహించడంతో జాతర ప్రశాంతంగా ముగిసింది. తీరంలో స్నానాలు చేసే వద్ద గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు అందుబాటులో ఉంటూ భక్తులకు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది కంట్రోల్ రూమ్ వద్ద నుంచి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, తప్పిపోయిన వారిని అప్పగిస్తూ అప్రమత్తంగా వ్యవహరించారు.



జాతరలో జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న అచ్యుతాపురం పోలీసులు



ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ లో మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పూడిమడక తీరానికి తరలిన భక్తులు

మునగపాక: అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర స్నానానికి బుధవారం మునగపాక మండల వ్యాప్తంగా పలువురు భక్తులు తరలివెళ్లారు. మండల ప్రజలు సముద్ర తీరానికి వెళ్లేందుకు వీలుగా బస్సు సదుపాయం కల్పించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులపై పిల్లలు, పెద్దలు పూడిమడక వెళ్లి సముద్ర స్నానం చేశారు.

వాడపాలెం తీరం కిటకిట



వాడపాలెం తీరం వద్ద బందోబస్తులో పాల్గొన్న పోలీసులు

రాంబిల్లి(యలమంచిలి): మాఘపౌర్ణమి సందర్భంగా రాంబిల్లి మండలం వాడపాలెం తీర ప్రాంతం స్నానాలకు వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వాహనాల్లో తరలివచ్చి మాఘ స్నానాలు చేశారు. మంగళవారం రాత్రంతా జాగరణ ఉన్న భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచి వాడపాలెం తీరానికి తరలివెళ్లారు. రాంబిల్లి సీఐ సిహెచ్.నరసింగరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి స్థానిక తీరంలో గంగమ్మతల్లికి మహిళలు విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.



వాడపాలెం తీరంలో స్నానాలకు వచ్చిన భక్త జనం

ప్రతి రైతుకు గుర్తింపు నంబర్ తప్పనిసరి



రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

రాంబిల్లి(యలమంచిలి): భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం ఇస్తున్న గుర్తింపు నంబర్ తప్పనిసరని మండల వ్యవసాయాధికారి సిహెచ్.సుమంత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు 12 అంకెలు గల యూనిక్ ఐడీ నంబర్‌ను కేటాయిస్తామన్నారు. తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట రుణాలు, పంట నష్టం, సబ్సిడీపై యంత్ర పరికరాలు అందుతాయన్నారు. రబీ ఈ–పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ నెల 20వ తేదీలోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాలకు నిత్యావసర సరకుల వితరణ

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలకు సెజ్‌లోని టయోట్స్ రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ బుధవారం నిత్యావసర సరకులు అందజేసింది. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యానికి పాఠశాల వ్యవస్థాపకుడు పి.ఎస్.టి.పట్నాయక్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వం



మున్సిపల్ కార్మికులతో సమస్యలపై చర్చిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసుదాసు

యలమంచిలి రూరల్: ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికుల సమ్మె సమయంలో కార్మిక సంఘాల నాయకులతో జరిపిన చర్చలకు సంబంధించిన మినిట్స్‌లో అంశాలను అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతేడాది సెప్టెంబరు మొదటి వారంలో విజయవాడలో వచ్చిన వరదల సమయంలో పనిచేసిన పారిశుధ్య కార్మికులకు ఇప్పటివరకు దుస్తులు, వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల కుటుంబాలకు పని కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ కోసం చేతి గ్లౌవ్స్, దుస్తులు, మాస్కులు, శానిటైజర్లు, సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు వై.నూకరాజు, సీహెచ్.వెంకటరమణ, ఎం.నాగరాజు, జె.వెంకటరమణ, ఇ.చంద్రరావు, డి.మహేష్, సీహెచ్.అన్నవరం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



రాజయ్యపేటలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఆయన రాజయ్యపేట పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయి.. రుచిగా, శుచిగా ఉంటున్నాయా? కావాల్సినంత పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం పెట్టాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అనంతరం ఎంపీడీవో రాజయ్యపేట గ్రామంలో పర్యటించి, సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను తక్షణమే తొలగించాలన్నారు. తడిపొడి చెత్తలను డంపింగ్ యార్డుల వద్దకు తరలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. త్వరలో మహాశివరాత్రి, నూక తాత పండగలు జరగనున్న నేపథ్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీధుల్లో చెత్త తొలగించాలని, బావులు, కాలువల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. వీధి లైట్లు వెలిగేలా చూడాలన్నారు.

ఫుట్‌పాత్‌లే వ్యాపార స్థావరాలు!

- యలమంచిలిలో యథేచ్ఛగా అనధికార దుకాణాలు
- షాపులు, భవనాల ముందు స్థలాలు ఆక్రమించి అద్దెకు..
- ట్రేడ్ లైసెన్సులు లేకుండానే వ్యాపారం
- మున్సిపల్ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



ఫుట్‌పాత్‌ను అద్దెకిచ్చిన స్థలంలో తోపుడు బండ్ల వ్యాపారం




పట్టణంలో దుకాణం ఎదుట ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్

యలమంచిలి రూరల్: పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఆర్ అండ్ బీ, మున్సిపల్ స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకుంటున్న కొందరు ఆ స్థలాలను వేరే వ్యాపారులకు, తోపుడు బండ్ల వారికి అద్దెకు ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలో వ్యాపారాలు నిర్వహించుకోవాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. పురపాలక సంఘం అనుమతి తీసుకుని వ్యాపారాలు చేయాలి. అవి చిన్నవైనా, పెద్దవైనా సరే.. అయితే కొందరు వ్యాపారులు ఈ నిబంధనలను ఖాతరు చేయడంలేదు. అక్రమంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. పెద్ద పెద్ద షాపులు, భవనాల ఎదుట ఖాళీ స్థలాన్ని చిరు వ్యాపారాలకు ఎలాంటి అనుమతులు లేకుండా అద్దెకు ఇస్తున్నారు. దీంతో మున్సిపాలిటీకి ప్రతి నెలా లక్షల్లో ఆదాయానికి గండి పడుతోంది. అదే విధంగా పలు దుకాణాల ఎదుట ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పెద్ద దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఎదుట ఉన్న స్థలాల్లో షెడ్లు, తోపుడు బళ్లు పెట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారు. పండ్ల దుకాణాలు, కర్రీ పాయింట్లు, లస్సీ, బాదం మిల్క్, టీ స్టాల్స్, పాన్ షాపులు, బిరియానీ పాయింట్లు, పానీ పూరీ, హాట్‌చాట్, ఇతర ఫాస్ట్‌ఫుడ్ అమ్మకాలు, కూరగాయల వ్యాపారాలకు కొందరు యజమానులు స్థలాలను అద్దెకిస్తున్నారు. నెలకు రూ.4 వేల నుంచి రూ.13 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఈ దుకాణాలకు విద్యుత్ సౌకర్యాన్ని కూడా కల్పించడం గమనార్హం. వారి ఇళ్లు లేదా దుకాణాల నుంచి ఎదురుగా ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలు, ఇతర వ్యాపారాలు చేస్తున్న వారికి విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు యూనిట్‌కు అధికంగా ధర నిర్ణయించి విద్యుత్‌ను సైతం నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. గృహావసరాలకు తీసుకున్న కనెక్షన్లతో చిరు వ్యాపారులకు విద్యుత్‌ను అధిక ధరలకు విక్రయించడం నిబంధనలకు విరుద్ధమైనా విద్యుత్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ట్రేడ్ లైసెన్సులు లేకుండానే..

పట్టణంలో ఎలాంటి వస్తు విక్రయం జరపాలన్నా మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరి. అందు కోసం ట్రేడ్ లైసెన్స్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. అయితే పెద్ద షాపుల వారు తమ షాపుల ముందు ఏర్పాటు చేయిస్తున్న చిన్న వ్యాపారాలకు ఎలాంటి అనుమతి తీసుకోవడం లేదు. తద్వారా పురపాలక సంఘం ఆదాయానికి గండి పడుతోంది. మరో వైపు పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారాలు నిర్వహించే వారంతా ఫుట్‌పాత్‌లను మొత్తం ఆక్రమించేస్తున్నారు. డ్రైనేజీలపై కూడా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ద్విచక్ర వాహనాల అమ్మకాల షోరూంలు, సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకాలు జరిపే వారు ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలను పూర్తిగా ఆక్రమించి ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. పాదచారులు నడవడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటున్నాయి. ఈ కారణంగా పాదచారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. దుకాణాల ముందు రోడ్డు మీద వరకు సామగ్రి పెట్టుకోవడంతో పాటు వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పరిశీలించి చర్యలు



పట్టణంలో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసిన విషయం మా దృష్టికి రాలేదు. ఫుట్‌పాత్‌లను అద్దెకిచ్చి నెల నెలా రుసుము వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల పాదచారులు ఇబ్బందులు పడతారు. అదే విధంగా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఆక్రమణలు ఉంటే పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

– బీజేఎస్ ప్రసాదరాజు, యలమంచిలి మున్సిపల్ కమిషనర్

సత్యవరంలో 'పొలం పిలుస్తోంది'



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం 1, 2 గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఫార్మర్ రిజిస్టరీపై రైతులకు అవగాహన కల్పించారు. 2024–25 సంవత్సరానికి 2,584 ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగు చేస్తున్నారని, రబీ పంట ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధరపై ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి త్వరితగతిన ఏపీ ఫార్మర్ రిజిస్టరీ చేసుకోవాలన్నారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ మీద రైతులకు అవగాహన కల్పించారు.